ఔను.. మోదీ పెద్దన్నే!

రాష్ట్రంలో అదానీ పెట్టుబడులు పెడితే తప్పేముంది

- **పెట్టుబడులతో మోదీ, అమిత్ షా వచ్చినా ఆహ్వానిస్తాం**
- **మా కుటుంబ సభ్యులెవరూ ఈ ఎన్నికల్లో పోటీ చేయరు**
- **పన్ను కట్టేవారికి పంట పెట్టుబడి సాయం ఎందుకు?**
- **99 శాతం మంది ఇంజినీర్లు కాళేశ్వరంలో మునిగితేలారు**
- **అందుకే వాళ్లను నమ్మకుండా ఎన్‌డీఎస్‌ఏకు అప్పగించాం**
- **మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి**

వీడ్కోలు సందర్భంగా ప్రధాని మోదీతో సీఎం రేవంత్, మంత్రి పొన్నం చిరునవ్వులు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని పెద్దన్నగా పిలువడంలో తప్పేం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ముందుగా 'మోదీ మా పెద్దన్న', 'గుజరాత్ తరహాలో తెలంగాణ అభివృద్ధి' అని మంగళవారం చేసిన వ్యాఖ్యలను సమర్థించుకునేందుకు ప్రయత్నించారు. ప్రధాని స్థానంలో ఉన్నవారు పెద్దన్న తరహా పాత్ర పోషిస్తారని, అమెరికాను ఇతర దేశాలు బిగ్ బ్రదర్ అని పిలుస్తాయని చెప్పుకొచ్చారు. గుజరాత్‌కు మోదీ అనేక ప్రాజెక్టులు మంజూరు చేశారని, ఇదే తరహాలో తెలంగాణకు కూడా మంజూరు చేయాలని కోరానంటూ సమర్థించుకునే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయింది, జాతీయ కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంలా మారిందన్న ప్రధాని వ్యాఖ్యలపై స్పందిస్తూ.. బీజేపీ నేతలు ఆయనను తప్పుదోవ పట్టించారన్నారు. బీజేపీపై పెద్దగా విమర్శలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించగా.. రాష్ట్రంలో బీజేపీ ప్రభావం పెద్దగా లేదని, అందుకే విమర్శించడం లేదని చెప్పారు. వాస్తవానికి రాష్ట్రంలో పోటీ బీజేపీ, కాంగ్రెస్ మధ్యేనంటూ సీఎం సహా కాంగ్రెస్ నేతలు పదే పదే వ్యాఖ్యానిస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 7 లేదా 8 తేదీల్లో కాంగ్రెస్ ఎన్నికల సంఘం సమావేశం ఉన్నదని ఆరోజు తొలిజాబితా ప్రకటిస్తామని సీఎం చెప్పారు. ఈ ఎన్నికల్లో తమ కుటుంబ సభ్యుల్లో ఎవరూ పోటీ చేయడం లేదని స్పష్టం చేశారు. అదానీని ఓవైపు రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తుంటే.. మరోవైపు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఆహ్వానించడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. అదానీకి రాష్ట్రానికి చెందిన ఎలాంటి ప్రాజెక్టులు అప్పగించలేదని, ఆయనే సొంత డబ్బులు పెట్టుబడిగా పెడుతుంటే తప్పేమిటన్నారు. పెట్టుబడులతో మోదీ, అమిత్‌షా వచ్చినా ఆహ్వానిస్తామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉండగా ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేసి, ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్‌కు డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించగా.. అధికారుల నివేదిక వచ్చాక స్పష్టత ఇస్తామంటూ సమాధానం దాటవేశారు.

ఎన్‌డీఎస్‌ఏకు నాలుగు నెలలు ఎందుకు?

మేడిగడ్డ బరాజ్ మరమ్మతులు, మిగతా బరాజ్‌ల పటిష్టతను సాంకేతికంగా పరిశీలించాల్సి ఉన్నదని, అందుకే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ)ని ఆశ్రయించామని సీఎం చెప్పారు. రాష్ట్రంలోని ఇరిగేషన్ ఇంజినీర్లలో 99 శాతం మంది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగస్వాములై మునిగితేలారని, వారితోనే విచారణ చేయిస్తే 'దొంగ చేతికి తాళాలు ఇచ్చినట్టు' అవుతుందని ఆరోపించారు. అందుకే కేంద్ర సంస్థకు లేఖ రాశామన్నారు. గత నెల 13న తాము లేఖ రాస్తే, రెండు రోజుల కిందట కమిటీ వేశారని, నివేదిక ఇవ్వడానికి నాలుగు నెలలు పడుతుందని చెప్పారని అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని అడ్డం పెట్టుకొని లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య ఒప్పందాలు కుదిరేందుకే ఇంత సమయం తీసుకుంటున్నారంటూ అనుమానం వ్యక్తం చేశారు. ఈ లెక్కన ఎన్‌డీఎస్‌ఏను కూడా నమ్మడం లేదా? అని ప్రశ్నిస్తే అదే మీలేదంటూ మాటమార్చేశారు. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీళ్లు నింపి ఎత్తిపోయాలన్న డిమాండ్లను కొట్టిపారేశారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చిన తర్వాతే మేడిగడ్డపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. అయితే తుమ్మిడి హట్టి దగ్గర బరాజ్ నిర్మాణం మాత్రం ఆగదని, కట్టి తీరుతామన్నారు. అక్కడి నుంచి ఆదిలాబాద్‌కు సాగునీరు అందిస్తామని చెప్పారు.

డబుల్ డిజిట్ ఖాయం

పార్లమెంట్ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తామని పదే పదే చెప్పిన రేవంత్ రెడ్డి.. మంగళవారం డబుల్ డిజిట్ సాధిస్తామని వ్యాఖ్యానించారు. అంటే 10 సీట్లు లేదా అంతకుమించి వస్తాయన్నమాట. ఇతర పార్టీ ఎమ్మెల్యేలు తనను కలువడంలో ఎలాంటి రాజకీయ కోణం లేదని, పార్టీలో చేరాలనుకుంటే తనను గాంధీభవన్‌లో కలిసేవారని స్పష్టం చేశారు. రైతులకు పెట్టుబడి సాయంపై నియంత్రణ విధిస్తామని చెప్పారు. పన్ను కట్టేవారికి సాయం ఎందుకని ప్రశ్నించారు. వ్యవసాయం చేసే రైతులకు, రైతు కూలీలకు మాత్రమే పెట్టుబడి సాయం ఇస్తామన్నారు. దీనిపై అసెంబ్లీలో చర్చించి, అఖిలపక్షంతో సమావేశమై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో పన్నురాబడిని గాడిన పెడుతున్నామని, ఇసుక, జీఎస్టీ ఆదాయం పెరిగిందన్నారు. ప్రస్తుతం కాళేశ్వరంపై విజిలెన్స్ విచారణ, గొర్రెల పంపిణీపై ఏసీబీ విచారణ కొనసాగుతున్నదని, త్వరలో మిగతా విభాగాలపైనా దర్యాప్తు జరుపుతామన్నారు.

హైకమాండ్ అసంతృప్తి?

సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీని పెద్దన్న అని పిలువడంపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఢిల్లీ నుంచి కాంగ్రెస్ అగ్రనేత ఫోన్ చేసి ఇదే విషయాన్ని రేవంత్‌రెడ్డికి వివరించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే హడావుడిగా మీడియా ప్రతినిధులను పిలిచి చిట్‌చాట్ పేరుతో తన వ్యాఖ్యలను సమర్థించుకునే ప్రయత్నం చేశారని చెప్పుకుంటున్నారు.

చిట్‌చాట్‌కు ఫోన్లు, పెన్నులు నిషేధం

సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం నిర్వహించిన చిట్‌చాట్‌కు ఫోన్లతోపాటు కనీసం పెన్నులను కూడా అనుమతించలేదు. సెక్యూరిటీ చెకింగ్ వద్దే వాటిని స్వాధీనం చేయాల్సిందిగా పోలీసులు సూచించారు. సమావేశ గదిలో కొత్త పెన్నులు ఇచ్చారు. దీంతో జర్నలిస్టులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పెన్నులపై కూడా నిషేధం విధిస్తారా? అంటూ ప్రశ్నించారు. ఇది తమను అవమానించడమేనంటూ మండిపడ్డారు. దీంతో సీఎంవో అధికారులు స్పందించి పెన్నులను తిరిగి తెప్పించి, జర్నలిస్టులకు అందజేశారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి చిట్‌చాట్ చేసినప్పుడు కొందరు రికార్డ్ చేశారని, అందుకే మొబైల్స్ అనుమతించలేదని, పెన్నులపై మాత్రం ఎలాంటి ఆంక్షలు లేవని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

ప్రధాని మోదీకి 11 విజ్ఞాపనలు

రెండు రోజుల పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వినతి

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : రెండు రోజుల పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదకొండు అంశాలపై విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. ప్రధానికి విన్నవించిన అంశాలు ఇలా ఉన్నాయి.

1. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పాలి. గత ప్రభుత్వం 1600 మెగావాట్లను మాత్రమే సాధించింది. మిగిలిన 2400 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి.
2. హైదరాబాద్ మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళనకు సహకరించండి.
3. తుమ్మిడిహెట్టి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. భూసేకరణ, నీటి వాటాల విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలి.
4. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై అమ్రాబాద్ ఫారెస్ట్ ఏరియా మీదుగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 2022–23లోనే కేంద్రం డీపీఆర్ తయారీకి రూ. 3 కోట్లు మంజూరు చేసింది. రూ. 7700 కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టును మంజూరు చేయాలి. ఈ కారిడార్‌తో శ్రీశైలం యాత్రికులతో పాటు హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లా వరకు 45 కి.మీ. దూరం తగ్గుతుంది. దక్షిణ తెలంగాణ వైపు రవాణా మార్గాలు విస్తరిస్తాయి.
5. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల కుటుంబాలకు ఇప్పటికీ నల్లా నీళ్లు అందటం లేదు. గ్రామాల్లో నూటికి నూరు శాతం ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.
6. కేంద్ర హోంశాఖ 2016లో తెలంగాణకు 76 ఐపీఎస్ క్యాడర్ పోస్టులను మంజూరు చేసింది. రాష్ట్రంలో పెరిగిన జిల్లాలు, పోలీసు కమిషనరేట్ల సంఖ్యకు అనుగుణంగా అత్యవసరంగా 29 పోస్టులను అదనంగా కేటాయించాలి.
7. హైదరాబాద్–రామగుండం, హైదరాబాద్–నాగ్‌పూర్ రహదారిపై రక్షణ శాఖ భూముల మీదుగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చిందుకు కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వీటితోపాటు కారిడార్ల నిర్మాణానికి కంటోన్మెంట్ ఏరియాలో 178 ఎకరాలు, 10 టీఎంసీ సామర్థ్యంతో కేశవాపురం రిజర్వాయర్ నిర్మాణానికి పొన్నాల గ్రామ సమీపంలోని 1350 ఎకరాల మిలిటరీ డెయిరీఫాం ల్యాండ్స్ (తోఫెఖానా) రాష్ట్రానికి బదిలీ చేయాలి. లీజు గడువు ముగిసిన శామీర్‌పేట ఫీల్డ్ ఫైరింగ్‌రేంజ్ (1038 ఎకరాలు) భూములను తిరిగి అప్పగించాలి.
8. ఐఐటీ, నల్సార్, సెంట్రల్ యూనివర్సిటీతోపాటు ఎన్నో పేరొందిన పరిశోధన, ఉన్నత విద్యా సంస్థలు ఉన్న హైదరాబాద్‌లో ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) నెలకొల్పాలి. అందుకు అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తుంది.
9. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా రాష్ట్రంలో 5259 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం వాటాగా రాష్ట్రానికి రావాల్సిన రూ. 347.54 కోట్లను వెంటనే విడుదల చేయాలి.
10. భారత్‌మాల పరియోజన జాతీయ రహదాలు అభివృద్ధిలో భాగంగా కల్వకుర్తి–కొల్లాపూర్, గౌరెల్లి–వలిగొండ, తొర్రూర్–నెహ్రూనగర్, నెహ్రూనగర్–కొత్తగూడెం, జగిత్యాల–కరీంనగర్ ఫోర్‌లేన్, జడ్చర్ల–మరికల్ ఫోర్‌లేన్, మరికల్–డియాసాగర్ టెండర్ల ప్రక్రియకు వెంటనే అనుమతులు మంజూరు చేయాలి.
11. సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో కొత్త శకానికి నాంది పలికేందుకు ఇండియా సెమీ కండక్టర్ల మిషన్‌లో భాగంగా తెలంగాణలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకారాన్ని కోరుతున్నాం.

బయటే కాదు.. ట్విట్టర్‌లోనూ ఫాలో

- **మోదీ అంటే రేవంత్‌కు పిచ్చి అభిమానం**

హైదరాబాద్, మార్చి 5(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసింది మొదలు అవకాశం చిక్కిన ప్రతిసారీ ప్రధాన మంత్రి దృష్టిలో పడేందుకు తాపత్రయపడుతున్నారు. మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి రాగా ఆయన వెన్నంటే ఉన్నారు. మోదీ మంగళవారం సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న వీడియోను ఎక్స్‌లో సీఎం రీట్వీట్ చేసి మోదీపై భక్తిని మరోసారి చాటుకున్నారు. దీనిపై స్పందించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత 'పెద్దన్న–చిన్నన్నల బంధం ఎంత గాఢంగా ఉందో చూడండి. ఇది బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న రహస్య బంధాన్ని తెలియజేస్తున్నది. మీ రాజకీయాలతో తెలంగాణను నాశనం చేయొద్దు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెటిజన్లు కూడా రేవంత్ తీరుపై సెటైర్లు వేస్తున్నారు.

జర్నలిస్టులది ప్రతిపక్ష పాత్రే

- **జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగువారికి తగ్గుతున్న ప్రాధాన్యం**
- **సీఎం రేవంత్‌రెడ్డి**

సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎప్పుడూ ప్రతిపక్షమేనని, ప్రజా సమస్యలు వెలికి తెచ్చి పరిష్కరింపజేయడం ఒక్క జర్నలిస్టులకే సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రవీంద్రభారతిలో ప్రముఖ పాత్రికేయుడు, ఆంధ్రప్రభ సంపాదకుడు పొత్తూరి వెంకటేశ్వరరావు స్మారక ఉత్తమ పాత్రికేయ పురస్కారం సీనియర్ పాత్రికేయుడు, ఇండియా టుడే మాజీ సంపాదకుడు ఎస్ వెంకట్ నారాయణకు ఆయన ప్రదానం చేశారు. సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పొత్తూరి వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పరిపాలనలో అనుభవజ్ఞుల సూచనలు, సలహాలు తీసుకొని తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో జాతీయ స్థాయిలో తెలుగువారి ప్రాధాన్యత తగ్గుతుందని, ఇది చాలా ప్రమాదకరమని, ఆ పరిస్థితి మారాల్సిన అవసరముందన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఢిల్లీ స్థాయిలో ప్రభావితం చేసే వారిని ప్రోత్సహించే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రమూర్తి, కె శ్రీనివాస్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, పలువురు సీనియర్ పాత్రికేయులు, పొత్తూరి వెంకటేశ్వరరావు అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో ఫ్యామిలీ ప్యాక్!

- **ఎంపీ టికెట్లు పంచేసుకుంటున్నారా?**
- **ప్రహసనంగా టికెట్ల పంపిణీ**
- **ఎంపీ టికెట్ల కోసం ద్వితీయ శ్రేణి నాయకుల ఎదురుచూపులు**
- **కుటుంబ సభ్యుల కోసం ఇప్పటికే రంగంలోకి సీనియర్ నేతలు**
- **ఎవరికి వారే తెరవెనక అలుపెరుగని ప్రయత్నాలు**
- **నిర్వేదంలో ఆశావహులు**

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపు మామూలుగా ఉండదు మరి! దరఖాస్తుల స్వీకరణ, వడపోత, అధిష్ఠానానికి జాబితా, ఆ తర్వాత ప్రకటన.. ఇలా చాలా ఉంటుందని ఎవరైనా అనుకుంటారు. కానీ, అదంతా ఒట్టి ముచ్చటేనని, ఆశావహులను నమ్మించేందుకు ఇచ్చే బిల్డప్పేనని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు. ఒకవేళ ఇన్ని ప్రక్రియలే ఉంటే మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిగా వంశీచంద్‌రెడ్డిని ఏకపక్షంగా ఎలా ప్రకటించారని ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మొదలు ముఖ్యనేతలంతా 'ఇది నాకు.. అది నీకు' అన్నట్టుగా పంచేసుకుంటారని పార్టీలోని ద్వితీయశ్రేణి నాయకులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా టికెట్ల పంపిణీ కాంగ్రెస్‌లో ప్రహసనంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజర్వుడు సీట్లను కూడా నేతలు వదిలి పెట్టడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కుటుంబ సభ్యులకు టికెట్లు ఇప్పించుకునేందుకు ముఖ్యనేతలు ఢిల్లీలో లాబీయింగ్ చేస్తుండడంతో ఆశావహులు ఆశలు వదిలేసుకుంటున్నారు.

ఫ్యామిలీ ప్యాక్

ఎంపీ టికెట్లను చాలావరకు పార్టీ పెద్దలు తన్నుకుపోయే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రతి నియోజకవర్గం నుంచి ఎవరో ఒక నాయకుడు కుటుంబ సభ్యుల కోసం రంగంలోకి దిగుతుండడంతో టికెట్ ఆశలు పెట్టుకున్న వారు నీరుగారిపోతున్నారు. నల్లగొండ ఎంపీ టికెట్‌ను తన కుమారుడు రఘువీర్‌రెడ్డికి ఇప్పించుకునేందుకు సీనియర్ నేత జానారెడ్డి ప్రయత్నిస్తుంటే, భువనగిరి టికెట్‌ను తన కుమార్తె, లేదంటే భార్యకు ఇప్పించుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఆయన సోదరుడు, మంత్రి వెంకట్‌రెడ్డి మాత్రం తన సోదరుడు మోహన్‌రెడ్డి కుమారుడి కోసం ప్రయత్నిస్తున్నారు. ఖమ్మం టికెట్‌ను తన భార్య నందినికి ఇప్పించేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రయత్నిస్తుండగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన సోదరుడు ప్రసాద్‌రెడ్డి కోసం, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పెద్దపల్లి టికెట్ వంశీకే

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు అయిన తన భార్య నిర్మలగౌడ్‌కు మెదక్ టికెట్ ఇవ్వాలని, కుదరకుంటే తన కుమార్తెకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని జగ్గారెడ్డి పట్టుబడుతున్నారు. ఇదే టికెట్ తన కుమార్తె త్రిష కోసం మంత్రి దామోదర రాజనరసింహ ప్రయత్నిస్తుండగా, మైనంపల్లి హన్మంతరావు కూడా రేసులో ఉన్నట్టు తెలిసింది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కుమారుడు వంశీకి పెద్దపల్లి టికెట్ దాదాపు ఖాయమైందని సమాచారం.

కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ

- **రాష్ట్రంలో డబ్బు దోచుకొనే పనిలో హస్తం పార్టీ బిజీ**
- **ఆ పార్టీ అవినీతిని వెలికి తీస్తున్నానని నాపై విమర్శలు**
- **దక్షిణ భారత దేశానికి గేట్‌వేలా తెలంగాణ రాష్ట్రం**
- **పటాన్‌చెరు కార్యక్రమాల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**
- **7,200 కోట్ల పనులకు శంకుస్థాపనలు, ప్రారంభాలు**

సంగారెడ్డి, మార్చి 5 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ కొత్త ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ ఆరోపించారు. రాష్ట్రంలో డబ్బు దోచుకొనే పనిలో ఆ పార్టీ బిజీ అయ్యిందని విమర్శించారు. అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలపై మోదీ పాలనలో సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని పటేల్‌గూడలోని ఎల్లంకి ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో వర్చువల్‌గా రూ.7,200 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బీజేపీ నిర్వహించిన ప్రజా సంకల్ప సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమ, ఆదరణను వృథా కానివ్వనని, రాష్ట్ర అభివృద్ధిని రెండింతలు చేసి చూపుతానని తెలిపారు. ఇందుకోసం తెలంగాణతో పాటు దేశంలోని ప్రజలంతా మూడోసారి బీజేపీకి పట్టం కట్టాలని, 400 ఎంపీ సీట్లు గెలిపించాలని కోరారు. మోదీ గ్యారంటీ ఇస్తే పక్కా జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలపై మోదీ ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ అవినీతిని బట్టబయలు చేస్తుండటంతో ఆ పార్టీ తనపై విమర్శలు చేస్తున్నదని వెల్లడించారు. తనకు కుటుంబం లేదంటూ ఇండియా కూటమి తనపై అనైతిక యుద్ధానికి దిగుతున్నదని చెప్పారు. దేశంలోని ప్రతి వ్యక్తి మోదీ కుటుంబసభ్యుడేనని, తనను ప్రజలంతా తమ కుటుంబసభ్యునిగా భావిస్తున్నారని అన్నారు. వారసత్వ రాజకీయ పార్టీలకు మోదీ భయం పట్టుకున్నదని తెలిపారు. దేశాన్ని మూడో అతి పెద్ద ఆర్థికశక్తిగా తీర్చిదిద్దుతానని, ఇది తన గ్యారంటీ అని వెల్లడించారు. మోదీ గ్యారంటీ అంటే తప్పకుండా అవుతుందని అన్నారు.

నన్ను దూషించే పనిలో ఇండియా కూటమి

కాంగ్రెస్ సహా కుటుంబ పార్టీలకు మోదీ భయం పట్టుకున్నదని ప్రధాని మోదీ విమర్శించారు. కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమిలోని పార్టీలు మోదీని దూషిస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మోదీ కంట్లో నలుసులా మారారని తెలిపారు. ఆ పార్టీ చేసిన అవినీతిని బయటపెడుతున్నానని వివరించారు. కాంగ్రెస్ పార్టీ వారసత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నది తప్ప యువ నాయకులకు పదవులు ఇవ్వదని విమర్శించారు. తాను మాత్రం తన వేతనం, తనకు వచ్చిన బహుమతులను దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నానని చెప్పారు. ఇంతవరకు తనకు సొంత ఇల్లు కూడా లేదని తెలిపారు.

మోదీ సభలో ఖాళీ కుర్చీలు

మోదీ బహిరంగ సభలో పలు ఆసక్తికరమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. 50 వేల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని బీజేపీ నాయకులు ప్రచారం చేయగా, మంగళవారం జరిగిన బహిరంగ సభకు పూర్తిస్థాయిలో జనం హాజరు కాలేదు. దీంతో చాలా చోట్ల ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వీఐపీ గ్యాలరీ సైతం నిండకపోవటంతో వీఐపీ పాసులు లేకున్నా కార్యకర్తలను వీఐపీ గ్యాలరీల్లో కూర్చోబెట్టారు. బీజేపీ నేతల మధ్య సమన్వయ లోపం కారణంగా జనసమీకరణ ఆశించిన స్థాయిలో జరగలేదు. దీంతో పార్టీ అగ్రనాయకులు జిల్లా నాయకుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేదికపై మోదీ ప్రసంగం కొనసాగిస్తుండగానే ప్రజలు బహిరంగ సభ నుంచి వెళ్లిపోవటం కనిపించింది.

తెలంగాణలో రాహుల్ ట్యాక్స్: కిషన్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో మార్పు కనిపిస్తుంది అనుకుంటే ఎక్కడా మార్పు కనిపించటం లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే కాంగ్రెస్ అవినీతికి పాల్పడుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ఆ పార్టీ రాహుల్ ట్యాక్స్ వసూలు చేస్తున్నదని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్న తలంపుతో ఈ పన్ను వసూలు చేస్తున్నదని ఆరోపించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తల నుంచి రాహుల్ ట్యాక్స్ పేరుతో డబ్బులు వసూలు చేసి పంపుతున్నట్టు తెలిపారు. బహిరంగ సభలో బీజేపీ నేతలు కే లక్ష్మణ్, ఈటల రాజేందర్, బీబీపాటిల్, రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ భారత్‌కు గేట్‌వేలా తెలంగాణ: మోదీ

దక్షిణ భారత్‌కు తెలంగాణ గేట్‌వే లాంటిదని ప్రధాని మోదీ అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. ఎల్లంకి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా రూ.7,200 కోట్ల పనులకు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.1,298 కోట్లతో నిర్మించనున్న సంగారెడ్డి చౌరస్తా–మదీనగూడ ఆరు లేన్ల 65వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.3,338 కోట్లతో నిర్మించిన పారదీప్–హైదరాబాద్ గ్యాస్ పైప్‌లైన్‌ను మోదీ ప్రారంభించారు. రూ.1,409 కోట్లతో నిర్మించిన కంది–రామసానిపల్లి జాతీయ రహదారి విస్తరణ పనులను జాతికి అంకితం చేశారు. రూ.400 కోట్లతో బేగంపేటలో నిర్మించిన సివిల్ ఏవియేషన్ రిసెర్చ్ సెంటర్, ఘట్‌కేసర్–లింగంపల్లి ఎంఎంటీఎస్ రైలును, రూ.1,165 కోట్లతో చేపట్టనున్న హైదరాబాద్–సికింద్రాబాద్ రెండోదశ ఎంఎంటీఎస్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి వినతిపత్రాన్ని పట్టించుకోని మోదీ

రాష్ట్రంలో ప్రధాని మోదీ రెండో రోజు పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి గైర్హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. వేదికపై ప్రధాని ప్రసంగించేందుకు వెళ్తుండగా వినతిపత్రాన్ని ఇచ్చేందుకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయత్నించగా, దాన్ని మోదీ స్వీకరించలేదు. దీంతో కోమటిరెడ్డి కొంత అసంతృప్తి గురయ్యారు.

జర్నలిజం సమాజహితానికి పాటుపడాలి

గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ) మార్చి 5 : జర్నలిజం రెండు వైపులా పదునున్న కత్తి అని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'జర్నలిజం అండ్ పబ్లిక్ రిలేషన్స్' అనే అంశంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి మంగళవారం గవర్నర్ హాజరై మీడియా నిపుణులనుద్దేశించి మాట్లాడారు. ఒక దేశ పాలనా స్వభావాన్ని, నాణ్యతను నిర్ణయించడంలో జర్నలిజం, ప్రజా సంబంధాల విభాగాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మీడియా నిపుణులు ప్రజలు, ప్రభుత్వ విభాగాలకు మధ్య వారధిగా ఉంటూ సమాజహితానికి కృషిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ శశాంక్‌గోయల్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ మాధవీ రావులపాటి హాజరయ్యారు.

హడ్కో రుణం 3 వేల కోట్లు

- **అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం సేకరించనున్నది. ఇందుకు రాష్ట్ర హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 95,235 ఇండ్ల నిర్మాణానికి రుణ సాయం అందించనున్నట్టు వెల్లడించింది. ఇందుకోసం తీసుకునే రుణాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించనున్నట్టు పేర్కొన్నది.

హస్తినకు నాగర్‌కర్నూలు పంచాయితీ

- **ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో మల్లు రవి భేటీ**
- **టికెట్ నాదంటే నాదే అంటున్న మల్లు రవి, సంపత్‌కుమార్**

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ (ఎస్సీ రిజర్వు) లోక్‌సభ నియోజకవర్గం హాట్ సీటుగా మారనున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి ఇదే నియోజకవర్గం పరిధిలో ఉండటంతో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నది. నాగర్‌కర్నూల్ ఎంపీ టికెట్ కోసం కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ నెలకొన్నది. ఇదే స్థానం నుంచి గతంలో ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన డాక్టర్ మల్లు రవి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. జోడు పదవులు ఉండరాదన్న కాంగ్రెస్ నియామావళి తనకు అడ్డంకిగా మారుతుందేమోనన్న భయంతో ఆయన ఇప్పటికే ఢిల్లీలో అధికార ప్రతినిధి పదవికి రాజీనామా చేశారు. ఇదే టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇదే నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ఆలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందినవాడిని కావడంతో స్థానికుడినైన తనకే టికెట్ ఇవ్వాలని సంపత్ కుమార్ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. నాగర్‌కర్నూల్ టికెట్ తనకే ఇస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని సంపత్‌కుమార్ ప్రచారం చేసుకుంటున్నారు. వాస్తవానికి మల్లు రవి సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. అయితే ఖమ్మం నుంచి ఎంపీ టికెట్ రేసులో మల్లు రవి సోదరుడు భట్టి విక్రమార్క సతీమణి నందిని రేసులో ఉండటంతో ఒకే కుటుంబంలో ఇద్దరికి టికెట్ ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి టికెట్ తనకే దక్కుతుందన్న ధీమాతో సంపత్‌కుమార్ ఉన్నారు. ఒకవైపు ఎంపీ టికెట్ కోసం తాను ఢిల్లీలో అధికార ప్రతినిధి పదవిని వదులుకున్నప్పటికీ, సంపత్‌కుమార్‌కు టికెట్ ఎలా ఇస్తారన్నది మల్లు రవి వాదన. ఎంపీ టికెట్ ఇస్తారన్న నమ్మకంతోనే ఎన్నికల వ్యయం కోసం తన ఇల్లు అమ్ముకున్నట్టు సంపత్‌కుమార్ చెప్తుండటంతో మల్లు రవి ఆందోళనకు గురవుతున్నారు. నాగర్‌కర్నూల్ టికెట్ తనకే దక్కుతుందని సంపత్‌కుమార్ ప్రచారం చేసుకుంటున్న నేపథ్యంలో మల్లు రవి మంగళవారం ఢిల్లీ వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. గతంలో నాగర్‌కర్నూల్ ఎంపీగా పనిచేసిన తనను స్థానికుడు కాదంటున్న పార్టీ నేతలపై ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. గతంలో ఇదే స్థానం నుంచి తన సోదరుడు దివంగత మల్లు అనంతరాములు, తాను కూడా ప్రాతినిధ్యం వహించిన విషయం గుర్తుచేశారు. అప్పుడు రాని స్థానిక నినాదం ఇప్పుడెలా వస్తుందని పార్టీ పెద్దలకు మల్లు రవి వివరించినట్టు తెలిసింది. సంపత్‌కుమార్ కూడా ఢిల్లీకి వెళ్లనున్నట్టు సమాచారం.

అవి ఎన్నికల సభలే తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో రెండు రోజులపాటు కొనసాగిన ప్రధాని నరేంద్రమోదీ పర్యటనలో అభివృద్ధి అంశాల ప్రస్తావన కంటే ఎన్నికల ప్రచారానికే అధిక ప్రాధాన్యత ఇచ్చారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఇది కేవలం ఎన్నికల సభ కాదంటూనే.. 400 సీట్లు, బీజేపీకే అందరి మద్దతు.. అంటూ ప్రసంగం చేశారని ఎద్దేవా చేశారు. పైగా రామమందిరానికి బంగారు తలుపులు, ధ్వజస్తంభం తెలంగాణ నుంచే వచ్చాయని, రాముడి ఆశీర్వాదం తెలంగాణ ప్రజలకు ఉంటుందని చెప్పిన ప్రధాని పర్యటనతో రాష్ట్రానికి, జిల్లాలకు ఒరిగిందేమీ లేదని అసహనం వ్యక్తం చేశారు.